వనభోజనాలు

బి. రాజేశ్వరి

"ఈ ఆదివారం ఎలాగైనా మనం గార్డెన్ పార్టీ పెట్టుకోవాలి!" అన్నాడు సీతారాం మిత్రులతో.

"నాకు యిన్‌స్పెక్షన్ తగిలింది బ్రదర్ ఆఫీసులో. ఈ సారికి నన్నొదిలేయండి" అన్నాడు రఘు.

"ఆ దేం కుదరదు. భగవంతుడిచ్చిన సెలవుల్ని కూడా యిన్‌స్పెక్షన్ పేరుతో దుర్వినియోగపరిచే ఆ ఆఫీసరు ఎవడోయ్!" గంగాధరం చాలా కోపంగా రఘు ఆఫీసరుని శాపనార్థాలు పెట్టడం మొదలెట్టాడు.

రఘు నిస్సహాయంగా చూశాడు.

"ఇది ఆఖరి వారం. కార్తీక మాసంలో ఆనవాయితీగా మనం కుటుంబాలతో వన భోజనాలు చేస్తున్నాం. ఇలా అయినా మన మిత్రులందరం కుటుంబాలతో ఒకచోట చేరటం, ఓ చక్కటి మరపురాని అనుభవం. మధురానుభూతి. యేమంటారు?" సీతారాం మిత్రుల్ని కలియ చూస్తూ ఉపన్యాస ధోరణిలో అన్నాడు.

"మా మాటకేంగాని దివాకర్ ఏం మాట్లాడటం లేదేమిటి?" అన్నాడు గంగాధరం.

అంతవరకు మౌనంగా వున్న దివాకర్ అప్పుడే ఆ ప్రతిపాదన విన్నవాడిలాగా అందరివంకా కలియజూసి, "మీరన్నదానికెన్నడైనా నే కాదన్నానా? మీరందరు ఎస్సంటే ఎస్సు, వద్దంటే మిస్సు!" అన్నాడు.

"మరి నన్ను మీతోబాటు రానిస్తే ఆనందంగా మీకు కంపెనీ యిస్తాను!" అన్నాడు సురేంద్ర. అతను బ్రహ్మచారి. ముదిరిన బ్రహ్మచారి. భగ్న ప్రేమికుడు. ప్రేయసి యెవర్నో పెళ్ళిచేసుకుని వెళ్ళిపోవటంతో ఆజన్మాంతం బ్రహ్మచారిగా వుండిపోవటానికి నిర్ణయించుకున్న ఆదర్శ ప్రేమికుడు. అతను, గంగాధరం ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు.

"ఎంతమాట! మీరొస్తానంటే కాదంటామా? మాకు ఓ ఫ్రెండ్ కూడా వెతుక్కోనక్కర్లేకుండా రెడీమేడ్‌గా దొరుకుతుందంటే మాకూ ఆనందమే!" అన్నాడు సీతారాం.

సురేంద్రతో అందరికీ చెప్పుకోదగ్గ స్నేహం లేకపోయినా, అందరు అతనంటే అభిమానంగా వుంటారు. అతను పెద్దమనిషి తరహాగా వ్యవహరించటమే అందుక్కారణం! అందరికీ పేకాట పిచ్చి వుంది. సురేంద్ర చక్కటి ఆటగాడు.

సురేంద్ర వెంటనే, "అయామ్ సారీ! మీరందరు భార్యాపిల్లలతో వెళ్తుంటే మధ్య నాలాంటి వంటరివాడు తలదూర్చటం నాకే భావ్యంగా వుందనిపించటం లేదు, మీరు వెళ్ళండి!" అన్నాడు.

తక్కిన నలుగురు, "భలేవారే, మీరు వంటరివారెలా అవుతారు? మేమందరం లేమా? ఇంకా మా పిల్లల అల్లరు భరించే శక్తి మీకుండాలిగాని, మీరు రావటం మాకు ఆనందదాయకమే!" అన్నారు, సురేంద్ర నొచ్చుకోకుండా.

"సరే, స్పాట్ చెప్పలేదు! యెక్కడ ఫిక్స్ చేసుకుందాం?" అన్నాడు గంగాధరం.

"అదే, మీరెవరైనా సజెస్టు చేయండి! మనం ప్రతిసారి ఓ, కొత్త స్థలం ఎన్నిక చేసుకుంటున్నాం. వెరైటీ యీజ్ బ్యూటీ!" యీసారి దివాకర్ అన్నాడు.

"అక్కడ ఉసిరిచెట్టు వుండాలా?" రఘు అన్నాడు.

"ఉంటే సంప్రదాయ బద్ధంగా వుంటుంది. లేకపోయినా అడ్జస్టు అయిపోవచ్చు!" అన్నాడు గంగాధరం.

"అదేవన్నమాట! కార్తీక మాసంలో వన భోజనాలేమిటి, ఉసిరిక లేకపోవటమేమిటి? ఉండి తీరాలి!" అన్నాడు సీతారాం.

"సీతారాం చెప్పాడంటే అది రూలే! అలా అయితే రామచంద్రపురం రోడ్డున తోటలున్నాయి. అక్కడ ఉసిరిచెట్లుకూడా వున్నాయి!" అన్నాడు రఘు.

"బి.హెచ్.యీ.ఎల్‌కి పోయే రూట్‌లోనా? అవునండి. నేనూ యిదివరకోసారి అటు వెళ్తూ చూశాను. తోటలున్నాయి!" అన్నాడు సురేంద్ర.

"అయితే రేపోసారి వెళ్ళి ఆ తోట యజమాని యెవరో ఓసారి కల్సుకుని పర్మిషన్ అడుగుదాం!" అన్నాడు సీతారాం.

2

ఆదివారం ఉదయం ఆరుగంటలకే అందరు అనుకున్న ప్రకారం కంట్రోల్ రూం ఎదురుగా వున్న సిటీ బస్టాపు దగ్గర పబ్లిక్ గార్డెను మెయిన్ గేటువద్ద కలుసుకున్నారు. అందరు సిటీలోని వివిధ ప్రాంతాలనుంచి అయిదు గంటలకే తెమిలిపోయి, పిల్లలతో బస్సులు కొందరు, ఆటోలు కొందరు పట్టుకుని అక్కడకు చేరుకున్నారు. చివర్లో, యిక రాడనుకుంటున్న సమయంలో ఆరున్నరకు దివాకర్ భార్యతోను, యిద్దరు పిల్లల్తోను ఆటోలో వచ్చాడు.

రాగానే అందర్నీ క్షమించమన్నట్టు చూసి, "బస్ కోసం ప్రయత్నించాను. ఆదివారంకదా తేలిగ్గా దొరుకుతాయికదా అనుకున్నాను. కాని దిల్ కుష్ నగర్ నించి రావటమంటే యింత కష్టమని ఈరోజే తెల్సుకున్నాను" అన్నాడు దివాకర్.

ఆడవాళ్ళు ఒకరినొకరు పలకరించుకున్నారు.

"సురేంద్ర నిన్న రాత్రే వెళ్ళి అన్ని యేర్పాట్లు తోటలో చేసివుంచుతానన్నాడు. అతనుండేది సంజీవరెడ్డి నగర్లో. పైగా బ్రహ్మచారి, బాదరబందీ లేదు. అందుకే నిన్న అతన్ని ప్రొవిజన్స్ అన్ని తీసుకు వెళ్ళమని వర్కు ఎలాట్ చేసేశాను!" అన్నాడు గంగాధరం.

సీతారాం, రఘు అతనివంక ప్రశంసపూర్వకంగా చూశారు. "కాని మనం నలుగురం వుండి, మనకి కొత్తగా ఫ్రండయిన సురేంద్రగార్ని యీ పనికి నియోగించటం అంత బావుండలేదేమో!" అన్నారు.

"ఫరవాలేదు, అతను మా ఆఫీసులో నా కొలీగ్. అతనలా అనుకునే మనిషయితే చెపుతానా? మీకు

తెలీదుగాని, సురేంద్ర చాలా మంచివాడు. స్ట్రెయిట్ ఫార్వర్డు. ఉన్నతమైన వ్యక్తిత్వం. కొన్నాళ్ళు పోతే బడితే అతని గురించి మీరే చెపుతారు!" అన్నాడు గంగాధరం.

రామచంద్రపురంపోయే బస్ వచ్చి ఆగింది. ఖాళీగానే వుంది.

3

తోటలో సురేంద్ర అప్పటికే వంటవాళ్ళతో జీడి పప్పు వేసిన కమ్మటి ఉప్మా తయారు చేస్తున్నాడు. తోటలోకి ప్రవేశించిన జనాలకు ఆ కమ్మటి సువాసనలకు కరకరమంటూ ఆకలి పుట్టుకొచ్చింది.

సీతారాం, రఘు, దివాకర్ తమ భార్యల్ని సురేంద్రకు పరిచయం చేశారు. గంగాధరం భార్య పూర్ణిమ సురేంద్రకిదివరకే తెలుసు.

దివాకర్ భార్యనుచూసి సురేంద్ర ఒక్క క్షణం నివ్వెరపోయినట్టు కనిపించినా వెంటనే తన తొట్రుపాటును కప్పిపుచ్చుకున్నాడుగాని, సునంద వెంటనే ఈ లోకంలోకి రాలేకపోయింది.

"నమస్తే చెప్పవేం, బావుండదు చెప్పు!" అని భార్యను దివాకర్ మోచేత్తో పొడిచాకగాని సునంద తేరుకోలేదు. "వీళ్ళిద్దరూ మా పిల్లలు. అబ్బాయి పెద్దవాడు. అమ్మాయి చిన్నది!" అన్నాడు దివాకర్ పిల్లల్ని చూపించి.

సురేంద్ర నమ్రతగా నమస్తే చెప్పి, పిల్లల చెక్కిళ్ళు పుణికాడు. రఘు భార్య రేవతికూడా సురేంద్రను చూసి ఆశ్చర్యపోయినట్టు కనిపించింది.

"చాలా బాగా చేయించారు సురేంద్రగారూ, ఉప్మా.

నిజంగా జన్మ తరించిపోయింది" అన్నాడు సీతారాం ఉప్మాను, సురేంద్రను తెగ మెచ్చుకుంటూ.

"అసలు, ప్రపోజ్ చేసిన నువ్వేమో అందరితోను గెస్టులా వచ్చావు. మా సురేంద్ర అన్ని యేర్పాట్లుచేస్తే నువ్వు హాయిగా ఉప్మాను తింటు మెచ్చుకొంటు న్నావు!?" ఛలోక్తిగా అన్నాడు గంగాధరం.

సురేంద్ర పొడిగా నవ్వాడు. తన తడబాటును బహిర్గతం కాకుండా చాలా ప్రయత్నం చేస్తున్నాడతను. సునందవైపు చూడకూడదనుకుంటూనే రెండుమూడుసార్లు చూశాడు. సునంద అతని చూపుల్ని యెదుర్కోలేక కళ్ళు వాల్చేసుకున్నది.

రఘు చకచక చాపలు పరిచేసి, పేక దస్తాలు బయటకి తీశాడు. "సీతారాం, దివాకర్, రండి రండి! ఓయ్ గంగాధరం, నీక్కూడా బొట్టుపెట్టి పిలవాలా, రా,రా!" అంటూ హడావిడి పడిపోతున్నాడు.

గంగాధరం వంటవాళ్ళ దగ్గర కూచుని బంగాళా దుంప కుర్మాచేయిస్తున్న సురేంద్రను కేకపెట్టి పిలిచాడు.

సురేంద్ర అక్కడ్నుంచే జవాబిచ్చాడు. "సారీ, ఇక్కడ నే నీ పనులు చూస్తుంటాను, మీరు కానివ్వండి. చిక్కటి స్ట్రాంగ్ కాఫీ పంపిస్తాను. కాఫీయా, టీయా?" అన్నాడు.

గంగాధరం సురేంద్ర దగ్గరకు పరుగెత్తికెళ్ళి రెక్క పట్టుకొని గాడిపొయ్యిల దగ్గర్నించి లేవతీసి, "భలేవాడివే! ఉన్నది లింగులింగుమని అయిదుగురం. అందులో ఓ హేండ్ మిస్సయితే ఆడటం అనవసరం! ఈ గార్డెన్ పార్టీ వెలా తెలాపోతుంది" అన్నాడు. "పూర్ణిమా మీ ఆడవాళ్ళు దగ్గరుండి వంటపనులు చూసుకోకూడదా?

అక్కడ చేరి కబుర్లతో కాలక్షేపం చెయ్యకపోతే!?"
అంటూ భార్యను కేకేసి పిలిచాడు.

పిల్లలందరు తోటలో కేరింతలు కొడుతూ ఆడుకొంటున్నారు. వాళ్ళవంక అపురూపంగా చూసుకుంటూ లోకాభిరామాయణంలో పడిన ఆడవాళ్ళు గంగాధరం కేకతో, నవ్వుకుంటూ వంటవాళ్ళున్న చోటికి చేరుకున్నారు. ఆపాటికి గంగాధరం సురేంద్రను లాక్కుపోయి పేకాటముందు కూలేశాడు.

"ఇంకోదఫా జీడిపప్పు ఉప్మా లాగిస్తే బావుండునోయ్" అన్నాడు రఘు, సీతారాంతో.

అరటి ఆకుల్లో మళ్ళీ ఉప్మాలు వచ్చేశాయి. గంగాధరం భార్య పూర్ణిమ కేన్‌తో మంచినీళ్ళు, గ్లాసులు పట్టించుకొని వచ్చింది.

రఘు ఉప్మా నోట్లో వేసుకొని, "వేడిమీద తింటే ఓ రకం రుచీ, చల్లారాక యింకోరకం టేస్టూ ఉప్మాకే చెల్లిందోయ్ గంగాధరం!" అన్నాడు.

"సరే, పలమారేవు. శుభ్రంగా తినేసి మాట్లాడు!" అన్నాడు రఘు మంచినీళ్ళ గ్లాసు అందిస్తూ.

సరిగ్గా అదే సమయానికి ఆడవాళ్ళు యేదో గోలగా అరిచారు. సురేంద్ర బాణంలా దూసుకుపోయాడు. సునంద కొంగు అంటుకొని మండుతోంది. సురేంద్ర చేతుల్తో కొంగును నులిమి, మంట ఆర్పేశాడు. సిగ్గుతోను, భయంతోను సునంద వళ్ళంతా చెమట్లు పోశాయి. గుండె వేగం హెచ్చింది. సురేంద్ర చేతులు బొబ్బలెక్కాయి.

ఆపాటికి మగవాళ్ళందరు వంటపొయ్యిల దగ్గరకు చేరుకొన్నారు.

"అమ్మగారు వెనకపాటున నించుని వున్నట్టున్నారు బాబూ, చటుక్కున కొంగు అంటుకున్నది. బాబుగారు బాగానే అందుకున్నారు. మేము నీళ్ళు తీసుకురావటానికి నుయ్యి దగ్గరకు వెళ్ళాం! కేకలు విని పరుగెత్తుకొచ్చే లోపల యీ బాబుగారు మంట నార్పేశారు, చాలా అదృష్టవంతులం!" అన్నారు వంటవాళ్ళు.

"చాలా థాంక్స్ సురేంద్రగారూ!" అన్నాడు దివాకర్ కృతజ్ఞతగా.

"ఇట్సాల్ రైట్!" అంటూ వెనుతిరిగి వచ్చేశాడు సురేంద్ర. గంగాధరం ప్రశంసాపూర్వకంగా అతని చేతిని నొక్కాడు.

4

టేప్ రికార్డర్ నుంచి బాలుపాడిన, యే దివిలో విరిసిన పారిజాతమో..శ్రావ్యంగా వినిపిస్తోంది. రఘు తెచ్చాడు, టూయిన్ వన్ స్టీరియో రికార్డరు.

ఈ సంఘటన తర్వాత ఆట అంత యింటరెస్టుగా సాగటం లేదు. "చాలా ప్రమాదం తప్పిపోయింది. బలవంతంచేసి యీ ప్రోగ్రాం ఫిక్స్ చేసినందుకు ఏదైనా జరిగితే అదంతా నా తప్పే అయివుండేది!" అన్నాడు సీతారాం.

"ఇందులో నీ తప్పేముంది? ప్రతి యేడూ మనం గార్డెన్ పార్టీ పెట్టుకోవటం లేదా. అలాగే యీ సంవత్సరమూను, అనుకోకుండా యిలా ప్రమాదమెదురవుతుందని ఊహించలేం కదా!" అన్నాడు దివాకర్.

పూర్ణిమ వచ్చి, "భోజనాలు సిద్ధంగా వున్నాయి. చేసేస్తారా?" అనడిగింది.

ఆట యెలాగూ రసవత్తరంగా లేకపోవటంతో ఆమె

వచ్చి చెప్పగానే పేకలు ఓ పక్కగా పడేసి లేచి పోయారందరూ.

మోటారు బావివద్ద చల్లటి నీళ్ళతో చేతులు కడుక్కోగానే బడలికంతా తీరిపోయి చాలా హాయిగా వున్నట్టనిపించింది, ప్రతి ఒక్కరికీ. పిల్లలందరు గుడ్డల నిండా యిసకపోసుకొని కేరింతలు కొడుతూ తల్లుల కందకుండా యేడ్పిస్తున్నారు. చివరికి యెలాగైతేనేం, అందరు పెద్ద ఉసిరిచెట్టు కిందికి చేరారు. ఆ తోటలో ఉసిరిచెట్లు విస్తారంగా వున్నాయి. ఓ పక్కగా నూతి పక్కగా చేర్చి అరటిచెట్లు దట్టంగా పెరిగివున్నాయి.

రైతు నడిగి లేత అరటి ఆకులు కోసుకొని వచ్చాడు గంగాధరం. పూర్ణిమ అతనికి ఆ పనిలో సాయంచేసింది.

సీతారాం వాళ్ళిద్దరివంకా మురిపెంగా చూస్తూ "మీ భార్యాభర్తలు చాలా శ్రమతీసుకొని ఈ వన భోజనాలని రసవత్తరంగా నిర్వహించటం కన్నుల పండువుగా వున్నది!" అన్నాడు.

"ప్రతిసారీ నువ్వు సతీసమేతంగా యీ డ్యూటీ తీసుకునేవాడివి కదా, యీసారి మేం తీసుకొన్నాం. రఘుకూడా తీసుకుంటాడు మధ్యాహ్నం టిఫిన్ సెక్షను!" అన్నాడు గంగాధరం.

"ఆల్ రైట్! అయిదు గంటలకి మనం వైండప్ చేసెయ్యాలి! ఓ.కే!?" అన్నాడు సీతారాం.

వంటలు చాలా బాగా కుదిరాయి. పులిహోర అందరు మారు వడ్డించుకున్నారు. బూరెల్లో కమ్మటి నెయ్యి కొత్త రుచిని సంతరించుకొంటే బంగాళదుంప కుర్మా, బఠాణీ కలిసిన వంకాయ కూర ఘుమఘుమలు చిందించాయి. కొబ్బరి పెరుగు పచ్చడి గోంగూర పచ్చడితో

పోటీ పడింది.

అందరు సురేంద్ర మేనేజిమెంటును పొగిడారు. అతను సిగ్గుపడ్డాడు.

"మరీ అంతగా పొగిడెయ్యకండి, గర్వం వచ్చెయ్యగలదు! నేను చేసిందేం లేదు, అజమాయిషీ తప్ప!" అన్నాడు.

కడుపునిండా తిన్నాక కంటినిండా నిద్రపోవాలనిపించటం సహజం!

సీతారాం, రఘు, దివాకర్, గంగాధరం వరసగా పచ్చని చెట్టుకింద చాపలమీద వెల్లకిలా పడుకుని కబుర్లు చెప్పుకుంటున్నారు. సురేంద్ర మాత్రం ఒంటరిగా ఓ పక్కగా కూచుని ఓ కాగితంమీద ఏదో లిస్టు రాసుకుంటున్నాడు.

దూరంగా పిల్లల కేరింతలు వినపడుతున్నాయి. ఓ పక్కగా తోట తాలూకు పాలేర్లు యిద్దరు భోజనాలు చేస్తున్నారు. మిగిలిపోయిన ఆహారపదార్థాలని పాలేళ్ళను పిలిచి సురేంద్ర పెట్టెయ్యమన్నాడు. రైతును అంతక్రితం తమతో భోంచెయ్యమంటే, ఆయన మొహమాట పడిపోయాడు. సురేంద్ర ఆయనకు విడిగా పంపించాడు మోటార్ షెడ్ దగ్గరకు. రైతు సాధారణంగా ఆ షెడ్లోనే భోజనం చేస్తుంటాడు.

5

సాయంత్రం నాలుగున్నర అయింది.

పూర్ణిమ తెచ్చిన వార్త క్షణాల్లో అక్కడి వాతావరణాన్ని స్తంభింపచేసింది!

సునంద, యిద్దరు పిల్లలు కనిపించటంలేదు!

మొగవాళ్ళందరు ఉలిక్కిపడి లేచారు.

"ఏమిటి, అసలేమయింది పూర్ణిమగారూ!" అంటూ దివాకర్ లేచి చెప్పులు వేసుకుంటుంటే, తక్కినవాళ్ళు కూడా చకచక లేచి కూచున్నారు.

అరగంటక్రితం వాళ్ళ చిన్నపాప లెట్రిన్‌కి పోతానంది. సునంద ఆ పాపను తీసుకొని మోటార్ షెడ్‌కు దూరంగా కూచోబెట్టడానికి వెళ్ళింది. షెడ్ దగ్గర్నుంచి నీళ్ళుకూడా తీసుకువెళ్ళటం యిక్కడ్నుంచి మేం చూస్తున్నాం. తిరిగివస్తున్న జాడ కనపడకపోవటంతో పిల్లలు మళ్ళీ ఏం ఇబ్బంది పెడుతున్నారోనని రేవతి నేను వెళ్ళాం సాయంచేద్దామని! కాని అక్కడ సునందగాని, పాప, బాబుగాని లేరు. చుట్టుపట్ల అంతా వెతుకుతుంటే, రైతు యేమిటని అడిగారు. మేం చెప్పింది విని పాపం ఆయన కూడా కంగారుపడి, అంతటా వెతికించారు. కాని సునందగాని, పిల్లలుగాని కనపడలేదు....!

కాసేపట్లోనే అక్కడి వాతావరణం విషాదంగా మారిపోయింది.

అరగంటసేపు అందరు తోటంతా కలియతిరిగారు. సురేంద్ర తోట నుంచి రోడ్ కనెక్షన్‌వరకు పోయి వచ్చాడు. అతని ముఖం చాలా వాడిపోయి వుంది. దివాకర్ వచ్చేడు. దుఃఖాన్ని అపుకుంటున్నాడు. రేవతి ఏడ్చెయ్యటానికి సిద్ధంగా వుంది.

రైతు, పాలేళ్ళుకూడా వెతికి తిరిగొచ్చారు.

"చాలా చిత్రంగా వుందాది బాబూ! ఇంతదాకా బుల్లెమ్మని నేను చూసాను. వున్నట్టుండి ఎటు వెళ్ళిందో!" అన్నాడు రైతు. ఆయన పేరు బాలయ్య.

ఆ పాటికి సురేంద్ర, దివాకర్, సీతారాం, గంగాధరం, రఘు తోటంతా నాలుగోసారి చుట్టివచ్చేశారు.

కాని సునంద జాడ, పిల్లలజాడ దొరకలేదు. పాలేళ్ళు, వంటవాళ్ళు మరో పక్కనుంచి తోట కలియతిరిగి వచ్చారు. ఆడవాళ్లు, పిల్లలు బిక్కచచ్చిపోయి అలాగే వున్నచోటనే వుండిపోయారు. తమతోడి స్నేహితురాలు అంతదాకా తమ మధ్య తిరిగిన సునంద అంతర్ధానం కావటం వాళ్ళకు చాలా చిత్రంగాను, నమ్మశక్యం కాకుండాను వున్నది.

అనుమానంకొద్దీ రైతు షెడ్డును గాలించాడు. మాతిలో కూడా చూసివచ్చారు. యేదైనా విషపురుగు వంటిది కుట్టిందేమోనని అనుమానమున్న ప్రతిచోటా గాలించారు. కాని యెక్కడా సునంద జాడలేదు!" అప్పటికే చీకటి పడబోతుంది.

"ఇది చాలా విచిత్రంగా వుంది. తోటలో మనమధ్య వున్న మనిషి అకస్మాత్తుగా ఎక్కడికి వెళ్ళిపోతుంది? పైగా యిద్దరు పిల్లలుకూడా కనిపించటంలేదు. నాకేం అర్థంకావటంలేదు!" దివాకర్ గొంతు బొంగురుపోయింది. అతనికి తెలియకుండానే కళ్లు వర్షిస్తున్నాయి.

"నాకూ అదే అర్థం కావటంలేదు. అందరు ఇక్కడే వున్నారు. మనంకూడా విశ్రాంతిగా పడుకున్నామేగాని ఎవరమూ నిద్దరు పోలేదు. ఇంతమంది వుండగా బయట నుంచి యెవరో వచ్చి వాళ్ళను యెత్తుకుపోవటమనేది అసంభవం....! రఘు యేదో అంటుండగానే ఎవరో కీచుగా అరిచారు. "రేవతి కనిపించటంలేదు!" అని.

6

అందరు త్రుళ్ళిపడి చూశారు.

నిజమే! రేవతి లేదు ఎక్కడా.

రఘు పిచ్చిగా కేకవేశాడు. "ఇంతవరకు యిక్కడే

వున్నది కదా మీతో, ఇంతలోనే యేమయిపోయింది?” అన్నాడు.

మళ్ళీ ఆ మనిషి కోసం అన్వేషణ సాగించారు. రఘు మతి పోయిన వాడిలా తోటంతా తిరుగుతున్నాడు. బాలయ్య అయితే మరీను. తన తోటలో సరదాగా వన భోజనాలు చేసుకున్న బాబులకి యెంత కష్టమొచ్చిందీ అంటూ వాపోతున్నాడు. పాలేళ్ళను తరిమి తోటలో ప్రతీ అంగుళం వెతకమన్నాడు.

రేవతికి కూడా యిద్దరే పిల్లలు. తల్లి కనపడక పోవటంతో వాళ్ళిద్దరు ఏడుపు మొదలెట్టారు. పూర్ణిమ, సీతారాం భార్య విమల పిల్లల్ని సముదాయించలేక సతమతమవుతున్నారు.

సురేంద్ర తోటచుట్టూ నిశితంగా పరిశీలించాడు. ఆ తోటకి ఎడమప్రక్క ఖాళీ స్థలం వుంది. కుడిపక్కగా మరొకరి తోట వున్నది. రెండు తోటలకి మధ్య చిన్న గేటుంది. తోటచుట్టూ ముళ్ళకంప కొట్టివున్నది.

సురేంద్ర పాలేళ్ళను పిలిచి అడిగాడు పక్కతోట గురించిన వివరాలు.

“అయ్యా, అది నర్సిమ్మ అనే రైతు తోటండి. నర్సిమ్మ కొడుకు యాదయ్య చూసుకుంటున్నాడు. ఉదయం అక్కడ కూడా వన భోజనాలయి నట్టుందండి. యెవరో నలుగురు బాబులు సైకిలుమోటర్ల మీదొచ్చి మజా చేసుకుండారు” అన్నారు వాళ్ళు.

సురేంద్రకి యేదో తట్టింది. “మజా చేసుకోవట మంటే....? మందు వగయిరా?....” అన్నాడు.

పాలేళ్ళు తలూపి “అవునండయ్యా! యేదో సీసాలు దెచ్చుకున్నారండి. తాగి తందానా లాడేరు....”

అన్నారు.

"అయితే వాళ్ళెవరో యాదయ్యకు, నర్సిమ్మకు బాగా తెలిసేవుండాలి, అవునా?"

"తెలుసుంటదండి!" అన్నారిద్దరు.

"మీరు పోయి తండ్రీ కొడుకు లిద్దర్లో యెవరైనా వున్నారేమో చూసిరండి!" అన్నాడు సురేంద్ర.

"ఎవరూ లేరు బాబూ! ఇందాకనే ఓ గంట క్రితం సిటీకి పోనారంట. పాలేరు జెప్పాడు" అని కబురు తెచ్చారు వాళ్ళు.

"ఆ పాలేరు నోసారిట పిలు!" అన్నాడు సురేంద్ర.

పక్కతోట పాలేరు పరుగెత్తుకొచ్చారు.

"ఏమయ్యా, మీ తోటలో యింతదాకా యెవరో పార్టీ చేసుకున్నారటకదా, వాళ్ళెవరో నీకు తెలుసా?" సురేంద్ర అడిగాడు.

"అళ్ళు అయ్యగారి దోస్తులయ్యా. ఓ గంట క్రితమే అయ్యగారు, అల్లు కలిసి సిటీకి యెల్లిపోనారు" అన్నాడు పాలేరు.

"అయ్యగారి దోస్తులా? పెద్దయ్యగారికా, చిన్నయ్యగారికా?"

"చిన్నయ్యగారికేనండి. అప్పుడప్పుడు అల్లొచ్చి తోటలో గడిపేసి పోతంటారు."

"ఎంతమంది? వాళ్ళ పేర్లేమిటి?"

"ఆ రోకోసారి నలుగు రొత్తారండి. ఇంకోపాలి యిద్ద రొత్తుంటారండి. పేరులు నాకు సరిగా తెలవదు బాబూ! మా చిన్నయ్యగో రొచ్చాక కనుక్కొని సెప్పమంటే సెపుతా!"

"ఆదిసరే, వాళ్ళు పార్టీ ముగించుకుని అందరు వెళ్ళి

పోయారా? దేంట్లో వెళ్ళారు?"

"రెండు సైకిలు మోటర్లు దెచ్చారండి. మా సిన్నయ్య గోరికి మోటరుందండి. ఆయిదుగురు మూడింటిమీదా కూచుని ఎల్లిపోనారండి!" అన్నాడు పాలేరు.

"ఊఁ! యిటుపక్కగా ఎవరయినా ఆడపిల్లలు గాని చిన్నపిల్లలుగాని రావటం నువ్వు చూశావా?"

"లేదండి!"

సురేంద్ర హతాశుడై పోయినట్టు చూశాడు. చివరి ప్రయత్నంగా అన్నాడు. "మీ అయ్యగారితో గాని, స్నేహితులతో గాని ఆడవాళ్ళవరైనా వెళ్ళారా?"

"అబ్బే, లేరు బాబూ!"

7

సురేంద్ర తిరిగి వచ్చేసరికి అక్కడి వాతావరణం చాలా గంభీరంగానూ, అంతకుమించి భయంకరంగాను వున్నది.

రఘు, దివాకర్ బోనుల్లో పడ్డ సింహాల్లా పచార్లు చేస్తున్నారు.

సురేంద్రను చూడగానే దివాకర్ కోపంగా అతని మీదికి దూసుకువచ్చి, "నా భార్యా పిల్లల్నేం చేశావు, చెప్పు" అన్నాడు.

సురేంద్ర నిర్ఘాంతపోయాడు.

"ఏమిటి మీరనేది? నాకేం తెలుసు? నేను మీతోనే వున్నాను కదా! వాళ్ళకోసమే యిప్పటిదాకా పక్క తోటలో ఎంక్వయిరీ చేసి వస్తున్నాను!"

"అబద్ధం! నువ్వే వాళ్ళనేదో చేసివుంటావు. నువ్వు సునందతోను, రేవతితోను ఏదో మాట్లాడటం వంటవాళ్లు చూశారు! వాళ్ళతో నీకు ఏం పని? నీకు వాళ్ళేలా

తెలుసు? చెప్పు, ఎన్నాళ్ళుగా సాగుతోంది నాటకం?" దివాకర్ యేం మాట్లాడుతున్నాడో అతనికే తెలీటం లేదు.

"నన్న పార్థం చేసుకుంటున్నారు. భగవంతుడి సాక్షిగా వాళ్ళు, పిల్లలు ఏమయ్యారో నాకు తెలీదు!"

"నటించకు! ఇందాకా, అంటే భోజనాలకి ముందు వంటయిందా అని వంటవాళ్ళ నడిగే నెపంతో నువ్వు సునందతో యేదో మాటలాడటం, ఆమె యేడవటం, నువ్వు సముదాయించటం, రేవతి కూడా మీ ఇద్దరితోను యేదో మాట్లాడటం యివన్నీ వంటవాళ్ళతో పాటు పూర్ణిమగారు, విమలగారు కూడా చూశారట. కాని మీరేం మాట్లాడుకున్నారో వాళ్ళకి సరిగా వినిపించ లేదట!

దీన్నిబట్టి నీకిదివరకే రేవతితోను, నా భార్యతోను పరిచయముండివుండాలి! అందుకే కావాలని యీ పార్టీకి నువ్వు తయారవటమే కాకుండా, అన్నీ నీమీద వేసు కున్నట్టు నటించి మా అందర్నీ ఆకట్టుకున్నావు. ఏదో ప్లాన్ వేసుకొని, కావాలనే యీ నాటకం ఎన్ను కున్నావు. చెప్పు, నా భార్యా పిల్లల్నేం చేశావో చెప్పు" ఆవేశంగా సురేంద్ర కాలర్ పట్టుకున్నాడు దివాకర్.

గంగాధరం కల్పించుకుని దివాకర్‌ని విడిపించి, "నువ్వు ఆవేశంలో యేం మాట్లాడుతున్నావో నీకే తెలి యటం లేదు—నీ భార్యను అవమానకరంగా మాట్లాడు తున్నావు, రఘు భార్యనీ అవమానిస్తున్నావు. నిజానిజాలు తెల్సుకోకుండా తొందరపడకు" అన్నాడు మందలిస్తూ.

రఘు కూడా ఆవేశంగా వున్నాడు.

"పోనీ అతనిలో ఎలాంటి దురుద్దేశం లేకపోతే నోరెత్తదేం? అదంతా నిజం కాదని ఒక్క మాట కూడా అనదేం?" రఘు అందుకున్నాడు.

"సురేంద్రగారూ! జరిగిన సంగతేమిటో చెప్పి వీళ్ళ అనుమానాలు నివృత్తి చెయ్యండి! మీరు అంత నీచ వ్యక్తి కాదని నాకు తెలుసు! కాని వీళ్ళు భార్యలు కనిపించక ఆ దుఃఖంలో వుండి వాళ్ళేం మాట్లాడుతున్నారో వాళ్ళకే తెలీదు! ప్లీజ్, జరిగిన సంగతి చెప్పండి!" సీతారాం అభ్యర్థించాడు.

సురేంద్ర అవమానభారంతో దెబ్బతిన్న లేడిలా తలెత్తి అందరివంకా చూశాడు. అతని కళ్ళలో యేదో వీర నిశ్చయానికి వచ్చిన ఛాయలు తొంగి చూస్తున్నాయి.

"ఇప్పుడు నేనేం చెప్పినా అది మీరు నమ్ముతారనే నమ్మకం నాకు లేదు. దివాకర్ గారూ, మీరు ప్రస్తుతం అనుమానమనే పెద్ద పిశాచంపట్టి వున్నారు. మీ రిప్పుడు చేసిన ఆరోపణలు నిజం కాదని మీకూ తెలుసు. నిజానికి చెద పట్టదు, గుర్తుంచుకోండి!" అన్నాడు సురేంద్ర.

ఎవరూ మాట్లాడలేదు. దివాకర్ పళ్ళ బిగువున కోపాన్ని నిగ్రహించుకోవటం స్పష్టంగా కనిపిస్తోంది. గంగాధరం మిత్రుడివంక ఆర్ద్రత నిండిన కళ్ళతో చూస్తున్నాడు. సురేంద్ర నిజాయితీ అతనికి తెలిసినంతగా అక్కడ ఎవరికీ తెలియదు.

సూర్యుడు అస్తమించటంతో నలుమూలలా పూర్తిగా చీకట్లు కమ్ముకొన్నాయి.

బాలయ్య పాలేళ్ళచేత పైరు బయటికి లాగించి బల్బులు పెట్టే ప్రయత్నంలో వున్నాడు.

సురేంద్ర, గంగాధరాన్ని పిలిచి, "నువ్వొక్కడివే నాకు తెలిసినవాడివి, స్నేహితుడివి. నేను టార్చి తీసుకుని యీ చుట్టుపక్కల అంతా వెతుకుతాను. మీరందరు రెస్టు తీసుకోండి. సునంద, రేవతిగార్లను, పిల్లల్ని తీసుకు వచ్చి అప్పగించేవరకు నేను మీ కళ్ళముందు పడను. నా ముఖం చూపించను!" అన్నాడు చకచక ముందుకి అడుగులు వేస్తూ.

గంగాధరంతో చెప్పి, బాలయ్యవద్ద టార్చి తీసుకున్నాడు సురేంద్ర. వడివడిగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయాడు.

8

సురేంద్ర పక్క తోటలోకి వెళ్ళాడు. పాలేరు ఒక్కడే వున్నాడు. అతన్ని చూడగానే దగ్గరగావచ్చి, "మీరా బాబయ్యా, మా దొరగారింకా రాలేదండి!" అన్నాడు.

"పెద్ద దొరా, చిన్నదొరా?"

"పెద్దొర యీ మద్దెన అసలు రావటం లేదండి. చిందొరే, యాదయ్య దొర!"

"తర్వాత, అంటే మీ దొర, ఆయన స్నేహితులు సైకిలుమోటార్ల మీద వెళ్ళిపోయాక, తోటలోకి యెవరైనా వచ్చారా?"

"ఎవ్వరూ రాలేదయ్యా!"

"నీ పేరేమిటన్నావు?"

"నాగయ్య దొరా!"

"చూడు నాగయ్యా, మాకు చాలా ముఖ్యమైన

సమాచారం కావాలి! మీ దొరగారితో వున్న స్నేహితులు యొక్కడుంటారో ఆ వివరాలేమయినా తెలుసునా?"

"నాకేటి తెలుస్తాది బాబూ, ఆ యిసయాలన్నీ మా దొరకే తెలుసు. కూలివాడికి చెపుతారా బాబూ?"

"సరే, మీ దొర మళ్ళీ ఎప్పుడొస్తారు?"

"రేపు తెల్లారినంకనే బాబయ్యా!"

"సరే! మీ దొర, ఆయన స్నేహితులు మజా చేసుకుంటున్న సమయంలో మా తోటలో నుంచి, అంటే బాలయ్యగారి తోటలో నుంచి యెవరయినా ఆడవాళ్ళు బయటకు వెళ్ళటంగాని, లేక యెవరయినా మగవాళ్ళు మరెవరో తోటలోకి ప్రవేశించటంగాని చూశావా?"

నాగయ్య కొద్ది క్షణాలు ఏదో గుర్తుచేసుకోవటానికి ప్రయత్నించాడు.

"ఇయ్యాల అలాంటివాళ్ళనెవర్నీ చూల్లేదు బాబయ్యా. నిన్న సందేల చూసేను" అన్నాడు.

"నిన్న సాయంత్రమా? నేను నిన్న సాయంత్రం యిక్కడే వున్నాను కదా!...." ఆశ్చర్యంగా అన్నాడు సురేంద్ర.

"అవును బాబూ! మీరొచ్చాకనే. మీరు ముందుగా వచ్చేసి, ఎనక ఆడంగులు, పిల్లలు యియ్యాల వొస్తారని సెప్పినారంట కందా, బాలయ్యగోరి పాలేరు కాంతయ్య సెప్పిండు దొరా!....మీరు లోపల బాలయ్య దొరతో మాట్లాడతన్నారు కందా, అప్పుడు సైకిలు మోటరుమీద ఓ ఆసామీ వొచ్చిండు. నన్ను పిలిసి, ఆ తోటలోకి ఆడోల్లెవరన్నా వొచ్చారా అనడిగారండి. నేను ఆయన గూడా మీ తాలూకేమో ననుకుని, మొగాయనే

వొచ్చారండి, రేపు పొద్దుగాలే అడంగులు, పిల్లలు వొస్తుం(డంటని సెప్పిన. ఆయన సర్లె అనుకుంట బోయిండు."

సురేంద్ర ఆశ్చర్యంగా విన్నా డతని మాటలు. జేబు నుంచి ఏభై రూపాయల నోటు తీసి నాగయ్య చేతి కందించాడు. నాగయ్య తీసుకోవటానికి మొహమాట పడుతుంటే బలవంతంగా అతని జేబులో పెట్టి, "ఫరవా లేదు, నీ కిది బక్షీసు, వుంచుకో!" అన్నాడు.

నాగయ్య హుషారుగా సురేంద్రవంక తిరిగి, "అడ గండి బాబయ్యా, యింకా యేం గావాల్నో!" అన్నాడు.

"చూడు నాగయ్యా, అతన్ని మీ చిన్నదొరతో ఎప్పుడయినా కలిసివుండగా చూశావా?"

"లేదు బాబయ్యా. మా యజమాని సేయితులు నాకు యాదే బాబూ!"

"సరే, అతను ఏవైపు నుంచి వచ్చాడు? అటు సిటీ వైపునుంచా, లేక యిటు బి.హెచ్.యీ.యల్. కోడ్డు నుంచా?"

"సిటీ ఏపునించే నండి."

"సరే, అతను నీకు మళ్ళీ కనిపిస్తే గుర్తుపట్ట గలవా?"

"నాకు యాదే బాబూ!"

"మంచిది. నేను నిన్ను యీ వివరా లడిగినట్టు యెవరికీ, చివరకి మీ దొర్లకు కూడా చెప్పకూడదు. సరేనా?"

"అయ్య బాబూ, నాకు తెల్దేటి బాబూ!"

సురేంద్ర ఆ తోటంతా గాలించాడు. కాని అనుమా

నించదగ్గది ఏదీ కనిపించటంలేదు. అక్కడ్నించి బాలయ్య తోటలోకి చూశాడు. ఏవో కిర్సనాయిలు దీపాలతో దివాకర్, రఘు తోటలో వెతుకుతున్నారు. బహుశా షెడ్డులో పాత హరికేన్ లాంతర్లున్నాయి కాబోలు, వాటి సాయంతో వెతుకుతున్నారు. ఇంకా ఆశ చావక తోట పరిసరాల్లోనే చూసిన చోటనే చూస్తూ, తిరిగిన చోటనే తిరుగుతున్నారు. వాళ్ళ వెంట సీతారాం, గంగాధరం వున్నారు! ఆడవాళ్ళు పిల్లలు, పాలేర్ల కాపలాలో షెడ్డు దగ్గర నించుని వున్నారు.

9

సురేంద్ర బయటనుండి బాలయ్య తోటచుట్టూ తిరగటం మొదలెట్టాడు.

బాలయ్య తోటకు ఓ పక్కగా సన్నటి కాలిబాట పోతోంది. అది సరాసరి తారురోడ్డుకి దారితీస్తోంది. తారురోడ్డు నుంచి తోటకు ఆ సన్నటి కాలిబాటే దారి!

అది దాదాపు ఓ ఫర్లాంగు దూరముంది. తారు రోడ్డు నుంచి తోటవరకు మోటరు సైకిలుకన్నా పెద్ద వాహనం రావటానికి సరిపడే జాగాలేదు. అంటే ఏదయినా కారు గాని, జీపుగాని సునంద రేవతిలను దాటవెయ్యటానికి ఉపయోగించి వుంటే, అవి తారు రోడ్డుమీదనే నిలిపి వుండాల్సి వుంటుంది! వాళ్ళు యిద్దరు, పిల్లలు యిద్దరు. పట్టపగలు ఎవరైనా యెత్తుకపోయి రోడ్డుమీద కార్లోకి చేరవేయటం అసంభవం!

కాబట్టి వాళ్ళను తోటనుంచి బయటకు చేరవేయటం జరగలేదు! అంటే బాలయ్య తోటలోనే యెక్కడో దాచిపెట్టారా, లేక .. ?

అప్పటికి రాత్రి తొమ్మిది దాటింది.

సురేంద్ర, బాలయ్య తోటకి యెడమ పక్కగానున్న ఖాళీస్థలం వైపు చకచక అడుగులు వేశాడు, టార్చిలైటు వెలుగులో.

అక్కడ దారి సుగమంగా లేదు. కంచె వేసిన కంప ముళ్ళు కాళ్ళకు అడ్డంపడుతున్నాయి. వేసుకున్నది చెప్పల్స్ కావటంవల్ల, ముళ్ళు యధేచ్ఛగా కాళ్ళ మడమలకు గుచ్చుకుంటున్నాయి. అయినా సురేంద్ర లెక్కచెయ్య లేదు.

బాలయ్య తోటకు ఎడమపక్కగా కొంతవరకు ఖాళీ స్థలం వుంది. ఖాళీస్థలం పక్కనుంచి మరో తోట ప్రారంభమయింది. దానికిచుట్టూ కంచెవేసి వుంది. ఓ పక్కనుంచి చెట్టు పచ్చి కొమ్మలతో కట్టిన కర్రగేటుంది.

సురేంద్ర మెదడు తీవ్రంగా పనిచేస్తోంది. సునంద చిన్నపాపను లెట్రినుకు తీసుకొచ్చిన బాలయ్య తోట ఏ పక్కకు వచ్చిందో సరిగ్గా ఆ పక్కకే కర్రగేటుంది.

సురేంద్ర మెదడులో మెరుపులు మెరిశాయి. రెండు తోటలకు మధ్యన వున్న ఖాళీస్థలం అంతా యిసకతో కూడి వుంది. ఇసకలోకి టార్చి ఫోకస్ చేసి చూశాడు. అడుగుజాడలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కలగాపులంగా వున్న అడుగుజాడలు! బాలయ్య తోటకు ఆ వైపు కంచె పక్కకు లాగేశారు ఎవరో! అక్కడ దారిచేశారు. ఆ దారి సరాసరి బాలయ్య తోట నుంచి పక్కనున్న తోట కర్రగేటుకి దారితీస్తోంది!

అంటే, సునందను పిల్లల్ని ఆ పక్కనుంచే యీ ఎడమపక్క తోటలోకి ఆ గేటుద్వారా తీసుకుపోయి వుండాలి!

సురేంద్ర కర్రగేటును సమీపించి పరీక్షగా చూశాడు.

లోపల ఓ నిట్రాటకు, గేటుకు సన్నటి యినపతీగతో బంధించి వుంచారు. దాన్ని విప్పటకుని వెళ్ళటం కష్టం కాదు. మెలిక తిరిగిన తీగ!

సురేంద్ర చకచక మెలిక తిప్పి, తీగను విప్పేశాడు. తీగ రెండో కొన నిట్రాటకు కట్టబడి వుంది! సురేంద్ర గేటు తెరుచుకొని తోటలోనికి ప్రవేశించాడు.

తోటంతా నిశ్శబ్దంగా వుంది. కీచురాళ్ళ రొద భయంకరంగా వుంది. చుట్టూ చిమ్మచీకటి. టైం చూసుకొన్నాడు. రేడియం ముళ్ళు మెరుస్తూ ఎనిమిదిగంటల యిరవై నిమషాలు చూపిస్తున్నాయి. అక్కడికి రోడ్డున పోయే వాహనాల హెడ్ లైట్ల వెలుగు వుండీ వుండీ కనిపిస్తోంది.

నేలమీదకు మాత్రం టార్చి వెలుగును ఫోకస్ చేసి, టార్చి వెలుగుకు చేతిని అడ్డంపెట్టి వెలుగు చెదిరిపోయి, యెవరికి అనుమానం రాకుండా జాగ్రత్త తీసుకుంటూ నడుస్తున్నాడు సురేంద్ర.

దూరంగా యెక్కడో సన్నటి వెలుగు పడుతోంది. అది బహుశా మోటరు ఆపరేట్ చేసే షెడ్డు కావచ్చునని ఊహించాడు సురేంద్ర!

షెడ్డువెపు అడుగులు వేస్తున్నాడు. చుట్టూ ఎలాంటి అలికిడీ లేదు. చీమ చిటుక్కుమంటే వినిపించేటంత నిశ్శబ్దంగా వుంది. అది నారింజ,నిమ్మ మామిడి మొక్కలు విస్తారంగా వున్న తోట!

కింద ఎండుటాకులు కాళ్ళ కిందపడి చప్పుడు చేస్తున్నాయి. శబ్దం రాకుండా సురేంద్ర చేస్తున్న ప్రయత్నం ఫలించటంలేదు! సాధ్యమైనంత మెల్లగా అడుగుతీసి అడుగువేస్తూ నడుస్తున్నాడు.

ఎక్కడినుంచో చిన్నపాప ఏడుపు సన్నగా ఒక్క సారి వినిపించి ఆగిపోయింది! ఎవరో నోరు నొక్కేసి నట్టుగా స్పష్టంగా తెలిసింది సురేంద్రకు!

అంటే....అంటే....సునంద, రేవతి, పిల్లలు ఇక్కడే యీ తోటలోనే యెక్కడో బంధింపబడి వుంటారు! సురేంద్రకు వేయి ఏనుగుల బలం వచ్చింది. ఈ సమయంలో చంటిపిల్ల రోదన స్వరం యీ తోటలో వినిపించిందంటే, అది సునంద పిల్లల గొంతే అయివుండాలి! లేదా ఆ తోటలో పనిచేసే వాళ్ళ పిల్లలైనా అయి వుండాలి.

వెలుగు దగ్గర పడింది. అది షెడ్డునుంచే వస్తోంది. నెమ్మదిగా షెడ్డు దగ్గరకు వెళ్ళాడు. లోపల్నుంచి ఎలాంటి అలికిడీ వినపడలేదు. షెడ్డుకు ఓ చివరగా వున్న ఖాళీ ప్రదేశంనుంచి ఆ వెలుగు బయటకు కనిపిస్తోంది. తలుపు మూసివున్నది.

సురేంద్ర అడుగులో అడుగు వేసుకుంటూ షెడ్డును సమీపించి ఆ ఖాళీ జాగానుంచి లోనికి చూశాడు! లోపల ఎవరూ లేరు.

సురేంద్ర ఆశ్చర్యంగా అక్కడ్నుంచి పక్కకు కదిలాడు. మరి చిన్న పిల్ల ఏడుపు విన్నది ఎక్కడ్నుంచి?

అతనికి కొద్ది క్షణాలు ఏం చెయ్యాలో అర్థంకాలేదు! టార్చిని కిందుగా ఫోకస్ చేశాడు.

ఇంతలో అకస్మాత్తుగా మళ్ళీ చంటిపిల్ల యేడుపు, ఆ వెంటనే యెవరో నోరు నొక్కెయ్యటం మరింత దగ్గరగా, స్పష్టంగా వినిపించింది సురేంద్రకు.

ఆ శబ్దాన్ని ఆధారం చేసుకొని ఆ పక్కకు అడుగులు వేశాడు సురేంద్ర. దూరంగా తాటాకు కమ్మలతో కట్టిన

ఓ పాక అతని దృష్టిలో పడింది! ఏడుపు ఆ పక్కనుంచే వచ్చింది.

సురేంద్ర ఆ పాక దగ్గరకు చేరుకున్నాడు. లోపల ఏదో అలికిడి! బయటికి ఏదో సన్నటి గుడ్డి వెలుగు. బహుశా కొవ్వొత్తి వెలుగో, హరికేన్ లాంతరు వెలుగో కావచ్చు.

సురేంద్ర ఆ పాకను సమీపిస్తుండగానే అనుకోకుండా ప్రమాదం ఎదురైంది. ఎవరో వెనకపాటున అతని తలమీద బలమైన కర్రతో కొట్టారు.

సురేంద్ర కుప్పలా కూలిపోయాడు. కిందపడిపోతూ పక్కకి చూశాడు. ఎవరో పొడుగ్గా వున్న వ్యక్తి ఆ మసకచీకట్లో అతనికి కనిపించాడు. అతని చేతిలో కర్ర వుంది.

అంతే. సురేంద్రకు స్పృహ తప్పిపోయింది.

10

అతనికి మెలకువ వచ్చేసరికి, పిల్లల రోదన స్వరాలు మిన్నుముట్టుతున్నాయి. బహుశా ఆ గొడవకే తనకు మెలకువ వచ్చిందని గ్రహించాడు సురేంద్ర.

నేలమీద పడివున్నాడు తను. అది ఎక్కడో ఏమిటో, తనెందుకలా పడున్నాడో గుర్తొచ్చేందుకు కొంత సమయం పట్టింది. మెలకువ వచ్చినా ఏం ఎరగనట్టు అలాగే పడివున్నట్టు వుండిపోయాడు కాసేపు.

కళ్ళు మూసినా తెరిచినా ఒకలాగే వుంది. అంతా చీకటి! తను పాక బయటే పడున్నాడు. అక్కడే ఎవరో తనను తలమీద కర్రతో కొట్టారు. ఆ వ్యక్తినికూడా తను పడిపోతూ చూశాడు. ఎక్కడో చూసిన ముఖంలాగానే కనిపించింది. అదిప్పుడు గుర్తొచ్చింది.

ఆ రోజు తను, గంగాధరం కలిసి బాలయ్య తోటకు వచ్చి అతన్ని పర్మిషను అడుగుతున్నపుడు, అతను బాలయ్య పక్కనే వున్నాడు! తాము బాలయ్యతో వన భోజనాలకి వస్తున్నట్టు, ఆదివారం వస్తామని, శనివారం రాత్రికే సామానుతో కొందరు వచ్చేస్తామనీ చెప్పటం, బాలయ్య అంగీకరించటం—అవన్నీ పక్కనే వున్న ఈ వ్యక్తి విన్నాడు! అయితే....?

సురేంద్రకి ఒక్కో సంఘటనే గుర్తొస్తోంది. ఆడ వాళ్ళతో వస్తున్న విషయం తెలిసి, ఆ సంగతి కాస్తా దుండుగులకి తెలియజేసి ఆడవాళ్ళమీద అత్యాచారం చెయ్యటానికి సిద్ధమయ్యారా? ఆ వ్యక్తి బాలయ్యకి బాగా తెలిసిన వాడే అయివుండాలి! అంటే బాలయ్యకి యీ కిడ్నాపింగ్ తో సంబంధముందనుకోవాలా? అదే నిజమయితే సునంద, రేవతి యీసరికి....?

భగవాన్, అలా జరక్కూడదు! అన్నెం పున్నెం ఎరగని సునంద మలినం కాకూడదు! ఆమె స్వచ్ఛమైన తెల్ల గులాబీ! ఆమెను ముట్టుకోవటానికి ఎవరికీ హక్కు లేదు!—ఒక్క దివాకర్ కి తప్ప!

సురేంద్రకు తన కాలేజి రోజులు, ఆ రోజుల్లో సునందను తను ఆరాధించటం, కాలేజి బ్యూటీగా పేరు పొందిన సునంద కాలేజి అంతటికీ తనొక్కడినే అభిమానించటం, తను తమ మధ్యనున్న పవిత్ర ప్రేమను వివాహంగా మార్చుకోవాలని ప్రయత్నించటం, సునంద తండ్రి అంగీకరించకపోవటం, ఫలితంగా ఆమెకు దివాకర్ తో వివాహం జరిగిపోవటం, తను భగ్నప్రేమికుడుగా, బ్రహ్మచారిగా మిగిలిపోవటం-అన్నీ సినిమారీళ్ళలా తిరిగాయి.

అన్నాళ్ళ పరిచయంలోను తను పొరపాటున కూడా

సునంద మునివేలు కూడా తాకలేదు! ఆమె కూడా ఎప్పుడూ హద్దులుమీరి ప్రవర్తించలేదు! తమ యిద్దరి ప్రేమకు మరో మూగసాక్షి రేవతి—సునంద స్నేహితు రాలు!

ఇన్నాళ్ళ తరవాత అనుకోకుండా యీ గార్డెన్ పార్టీలో ఆమెను చూస్తానని కల్లోకూడా అనుకోలేదు. కాని కల నిజమయింది. తన ఆరాధ్య దేవత తన కళ్ళ ముందు ప్రత్యక్షమయి మనసు అంతరాంతరాలలోని ప్రేమ వాహినిని కట్టలు తెంచింది.

కాని .... కాని ....ఆమె ప్రస్తుతం పరాయి స్త్రీ. దివాకర్ భార్యగా అతని యిద్దరు బిడ్డలకు తల్లిగా సమాజంలో ఉన్నతమయిన స్థానంలో వున్నది! తనో సామాన్య గుమాస్తాగా జీతం డబ్బుల్తో బతుకుతున్నాడు. ఆమె చేసిన పనే కరెక్టు! ఆఫీసరు భార్యగా చక్కటి అంతస్తును సంపాదించుకున్నది!

తనని చూడగానే ఆమె కళ్ళలో ఎన్ని కోట్ల మెరుపులు! ఎంత కాంతి! ఇన్నాళ్ళుగా మనసు పొరలి మధ్య పదిలంగా దాచుకున్న ప్రేమ అంతా ఆ కళ్ళలోనే ప్రతిఫలించింది! రేవతి కూడా తనని గుర్తించింది. కాని తను బయటపడితే, ఆమె జీవితం, బంగారు భవిష్యత్తు ఏమవుతాయి?

అందుకే....అందుకే...ఆమె అపరిచిత వ్యక్తి అన్నట్టు ప్రవర్తించాడు. దివాకర్ రెట్టించి అడిగినపుడు కూడా ఏమీ సమాధానం చెప్పలేదు. తను నిజంచెప్పి మరిన్ని అపార్థాలకు, అనర్థాలకు దారితీయకూడదనే ఏమీ చెప్ప కుండా మౌనం వహించాడు. తూటాల్లాంటి మాటలతో తనను తూట్లు పొడిచినా పెదవి కదపలేదు తను.

పక్కన అడుగుల చప్పుడు వినిపించి ఊపిరి బిగ బట్టాడు. వాడొస్తున్నాడు తను కదలకూడదు. బిగ దీసుకుని పడుకున్నాడు.

ఆ వచ్చిన వ్యక్తి వెంట మరో వ్యక్తి వున్నట్టు మాటల్నిబట్టి అర్థం చేసుకున్నాడు.

"ఒక్క దెబ్బతో నేల కరిచాడు. మన దొర ఇంకా రాలేదు కదా. వచ్చాక వీడి సంగతి చూద్దాం!" అంటున్నాడు తనని గాయపరిచిన వ్యక్తి.

"అసలు చచ్చాడో బతికాడో చూశావా? వీడ్నింకా ప్రాణాలతో వదలటం ప్రమాదకరం! మన సంగతి తెలిసిన ఒకే ఒక సాక్షి వీడు!" అంటున్నాడు రెండో వ్యక్తి.

అతని మాటలు వినగానే సురేంద్ర ఊపిరిబిగబట్టాడు. ఏమాత్రం చలనం లేకుండా కర్రలా బిగుసుకుపోయాడు.

మొదటి వ్యక్తి సురేంద్ర ముక్కు దగ్గర చెయ్యి పెట్టి, "అరె, వీడు చచ్చాడు. మన పీడ విరగడయిపోయింది. వీడ్ని పక్కకు లాగేద్దామా?" అన్నాడు.

రెండో వ్యక్తి అటు యిటు కాలితో సురేంద్రను తన్ని, "అవును చచ్చాడు. వీడ్ని యిక్కడే వదిలేద్దాం. పక్కకి జరపటం కాదు, దొర వచ్చాక ఏకంగా పూడ్చివేద్దాం!" అన్నాడు.

మొదటి వ్యక్తి, మన దొర ఎనిమిది గంటలకే వస్తానన్నాడే, యింకా రాలేదేమిటి?" అన్నాడు.

"అదే అర్థం కావటంలేదు! ఇప్పుడు పదిన్నర కావస్తోంది. ఆ కుర్ర వెధవల్ని ఆపటం మన తరం కావటంలేదు. గోల పెట్టేసున్నారు. ఆ అమ్మాయిలిద్దరు శోషవచ్చి పడిపోయినట్టు నేల మీద పడున్నారు.

వీళ్ళని ఎంతసేపు కాచుక్కూచోవాలో నాకర్థం కావటం లేదు!"

"గుంట లిద్దరూ భలే అందంగా వున్నారు సుమా! నాకు వాళ్ళని అలా వదల బుద్ధి కావటంలేదు."

"ఆ ఆలోచనే రానివ్వకు! మనం వాళ్ళని ముట్టుకునే అర్హత లేదు. మన దొర ఆకలిస్తే పేగులు లెక్కపెట్టే రకం! ఆయన వలచినపిల్లను కన్నెత్తి చూసినా సహించడు! ఈ పిల్ల ఆయన కావాలని కోరుకున్నాడు!"

"మనల్ని యిద్దరు అమ్మాయిల్ని ఉంచమని చెప్పలేదు కదా! ఆ పిల్లల తల్లినే కదా వుంచమని చెప్పాడు!?"

"రాత్రి బాస్ తోటకువచ్చి తోటప్రక్క కాపలా వాడ్ని అడిగి తెల్సుకున్నాడు—యింకా ఆడవాళ్ళు వస్తున్నారని తెల్సింది. ఇద్దర్ని వుంచమన్నాడు నాతో. అతని ఫ్రెండును కూడా తీసుకొస్తున్నాడు."

"కాని ఆ తోటలో యింకా మనుషులు తిరిగిపోలేదు. ఇంకా వెతుక్కుంటూనే వున్నారు!"

"వీడు వాళ్ళలో మనిషే కదా! అందుకే తగిన సన్మానం చేశాం. వీడు వెళ్తేనే కదా, మనం యిక్కడ అమ్మాయిల్ని దాచిన విషయం తెలిసేది? శాశ్వతంగా వీడినోరు మూత బడిపోయింది కదా! యిక ప్రమాదం లేదు!"

"చూడు, ఎక్కడో మోటారు శబ్దం వినిపిస్తున్నట్టుంది కదూ!...."

"....అబ్బే, అది యిటువచ్చే శబ్దం కాదు. రోడ్డున పోతోంది."

"దొర ఇక వచ్చేస్తాడులే! యీలోగా కాస్త మందు బిగించుకుందాం!"

ఇద్దరూ నవ్వుకున్నారు. మాటల సవ్వడి దూరమయి పోయింది.

సురేంద్రకు వాళ్ళ మాటలలో పూర్తిగా పరిస్థితి అర్థమయిపోయింది. వాళ్ళిద్దరు యెవరో దొరకి నమ్మినబంట్లు! సునందను పట్టితెమ్మని వీళ్ళకు ఆ వ్యక్తి ఆజ్ఞాపించాడు. ఈ రాత్రికి యీ తోటకు వస్తానని చెప్పిపోయాడు. వీళ్ళు సునందను, రేవతిని బంధించి చెరపట్టి వుంచారిక్కడ. బహుశా ఆ దొర యెవడో యీ తోట యజమాని అయి వుండాలి! అతని అనుచరుడైన యీ వ్యక్తి యెవడో బాలయ్యకు తెలిసినవాడే అయివుంటాడు. అందుకే తాము గార్డెన్ పార్టీకి వస్తూన్న విషయం వివరాలు యీ వ్యక్తికి చెప్పేశాడు అనుమానించకుండా!

అయితే సునందగాని, రేవతిగాని మలినపడలేదు. ఎంత అదృష్టం! ఇలాంటి నరరూప రాక్షసుల చేతుల్లో పడినాక కూడా యింకా తన సునంద....మల్లెపూవు లాంటి, తెల్ల గులాబీలాంటి, సునంద - భగవాన్, నువ్వు దయామయుడివి! అనుకున్నాడు సురేంద్ర ఆనందంగా.

"అయితే ఆ దొర ఎవడు? సునందనే కోరుకున్నాడంటే సునందను తెలిసినవాడయి వుండాలి! ఆమెను నీడలా వెంటాడుతున్నవాడయి వుండాలి! అందుకే అవకాశం కోసం ఎదురుచూస్తూ యిప్పుడు, యిలా యీ తోటలో బంధించి....

సురేంద్ర తల విదిలించాడు. చాలా నొప్పిగా వుండి చుర్రుమన్నది. మాడు తడుముకున్నాడు. జిగటగా తగిలింది. చేతికి రక్తం అంటుకుంది. గాయం బాధగావుంది. తల దిమ్ముగా వున్నది.

చాలా పెద్ద దెబ్బ తగిలింది! అయినా ఫరవాలేదు.

తన శరీరంలో ప్రాణ మున్నంతవరకు, తన ఆఖరి రక్తం బొట్టు ఆవిరయిపోయే వరకు, సునందను రక్షించి తీరు తాను.

సురేంద్ర లేచి నిలబడ్డాడు. అదృష్టవశాత్తూ టార్చి లైటు వాళ్ళ దృష్టిలో పడలేదు! అదే యిప్పుడు తనకు మార్గదర్శి!

టార్చి అందుకున్నాడు. పాకలోనుంచి పిల్లలు ఏడ్చి ఏడ్చి నిద్రపోయినట్టున్నారు. ఎలాంటి సవ్వడీ వినరావటం లేదు. పాక వెనక్కు వెళ్ళాడు. పాక సందుల్లో నుంచి లోపలకు తొంగిచూశాడు. హరికేన్ లాంతరు వెలుతురు గుడ్డివెలుగును ప్రసరిస్తోంది.

లోపల పిల్లలిద్దరు నేలమీదపడి నిద్రపోతున్నారు. ఆ పక్కనే చేతులు, నోరు కట్టబడివున్న సునంద, రేవతి! దుఃఖంతో ముఖాలు పీక్కుపోయి, జుట్టు, చీరెలు, చెదిరి పోయి, కన్నీటి చారికలు ముఖంమీద నిరంతరం కారటం వల్ల జిడ్డు పట్టిపోయి, పది లంఖణాలు చేసినవాళ్ళలాగా వున్నారు

సురేంద్రకు వాళ్ళను ఆ స్థితిలో చూడగానే కడుపుల్లో దేవినట్టయింది. వాళ్ళను ఆ స్థితికి తీసుకువచ్చిన దుండగుల్ని నామరూపాలు లేకుండా నాశనం చెయ్యా లన్న పిచ్చి ఆవేశం వచ్చింది.

ఆ వ్యక్తు లిద్దరు పాకకి అవతలపక్కన చుట్టలు తాగు తున్నారు. పక్కనే బీరు సీసాలో, బ్రాందీ సీసాలో తెలీదుగాని, చీకట్లో మెరుస్తున్నాయి. బాగా తాగు తున్నారు. ఇదే మంచి అవకాశం!

సురేంద్ర చుట్టూ చూశాడు. ఇందాకా మోటారు షెడ్డువద్ద ఇనుపరాడ్ నొకదాన్ని చూశాడు. అదే

ప్రస్తుతం తన ఆయుధం!

చకచక అలవాటుపడిన కళ్ళు చికిలించుకుంటూ వెళ్ళి యినుపరాడ్ తెచ్చుకొన్నాడు. చప్పుడు కాకుండా వెనక పాటున వెళ్ళి ఓ వ్యక్తి తల పగలేశాడు. వాడు కిక్కురు మనకుండా నేల వాలిపోయాడు!

రెండోవాడు తేరుకొని లేచేలోపల వాడ్ని కూడా రాడ్‌తో బుర్ర పగలేశాడు. వాడుకూడా పెద్దగా అరిచి నేల వాలిపోయాడు.

సురేంద్రకు పిచ్చి సంతోషం వేసింది. ఒక్క ఉదుటన్న పాకలోకి వెళ్ళి సునందను, రేవతిని తాళ్ళు విప్పి లేవ దీశాడు.

"సురేన్, నువ్వా?" అన్నది నిశ్చ్వరపోతూ సునంద. రేవతి ఆనందంగా చూస్తోంది.

"కమాన్, మనం వెంటనే పారిపోవాలి! మనవాళ్ళు యింకా బాలయ్య తోటలోనే వున్నారు! పిల్లల్ని నేను ఎత్తుకుంటాను!" అన్నాడు సురేంద్ర ఇద్దరుపిల్లల్ని చెరో భుజంమీద ఎత్తుకుంటూ.

సునంద, రేవతి ఆనందంగా పాక బయటకొచ్చారు.

"ఈ టార్చి ఫోకస్ చెయ్యి సునూ, దారి కనిపి స్తూంది!" అన్నాడు టార్చి సునంద కిస్తూ.

తోటకున్న కర్రగేటును తీసుకుని బయటికొస్తున్న సమయంలో యెక్కడి నుంచో మోటారుసైకిలు శబ్దం, ఆ వెంటనే హెడ్ లైటు కాంతి వాళ్ళ కళ్ళకు కొట్టింది.

ఇద్దరు వ్యక్తులు దూసుకుంటూ వచ్చేశారు.

"అరేయి, వీళ్ళేరా, పారిపోతున్నారు, పట్టుకో!"

అన్నాడో వ్యక్తి. రెండోవాడు రేవతిని పట్టుకుంటే మొదటివాడు సునందను పట్టుకున్నాడు. సురేంద్ర పిల్లల్ని ఆ యిసుకలోనే దింపేశాడు. ఒక్కసారిగా వాళ్ళిద్దరి మీదకు లంఘించాడు.

ఈలోపల సునంద తనని పట్టుకున్న వ్యక్తి చెయ్యి కండ వూడివచ్చేలా కొరికింది. అతను ఆమెను వదిలేసి 'అబ్బా!' అంటూ రక్తం ఓడుతున్న చెయ్యిపట్టుకుని కూలబడ్డాడు. రెండో వ్యక్తి చేతిలో కత్తి మెరిసింది!

మరుక్షణం ఆ కత్తి సురేంద్ర నెత్తురు చవి చూసి వుండేది! కాని సురేంద్ర లాఘవంగా తప్పించుకుని ఆ వ్యక్తి చేతిలోని కత్తిని లాక్కుని అతని కడుపులో రెండుసార్లు పొడిచాడు. ఆ వ్యక్తి రేవతిని వదిలేసి నేల మీద కూలిపోయాడు.

సురేంద్ర ఆడవాళ్ళిద్దరి వంకా తిరిగి, "పారిపోండి, నేను వీడి సంగతి చూసివస్తాను!" అన్నాడు మొదటి వ్యక్తిమీదికి ఉరుకుతూ.

"రేయ్ రాఘవా! నువ్వా?" అన్నాడు సురేంద్ర.

రాఘవ! తన క్లాస్‌మేటు! ఒకప్పుడు సునందచేత చెంపదెబ్బలు తిన్న రాఘవ!

"నువ్వా? నువ్వా యీ పాపానికి తలపెట్టింది?" సురేంద్ర అతనిమీదికి కత్తితో ఉరికే సమయానికి అకస్మాత్తుగా తన దగ్గిరున్న పొడవాటి కత్తితో సురేంద్ర పక్కలో పొడిచాడు ఆ వ్యక్తి—రాఘవ!

ఒకసారి కాదు, నాలుగుసార్లు!

సురేంద్ర ప్రాణం కడంటింది. కాని, మెరుపులా రాఘవమీదికి లేని ఓపిక తెచ్చుకుని తిరగబడ్డాడు. కసిగా రాఘవ గుండెల్లోను, పొట్టలోను పొడిచాడు.

అరుస్తూ నేలమీద పడిపోయాడు రాఘవ!

ఈలోపల సునంద, రేవతి వెళ్ళి అందర్నీ తీసుకొచ్చారు. సీతారాం, రఘు, దివాకర్, గంగాధరం, పూర్ణిమ, విమల, పిల్లలు అందరూ వచ్చేశారు!

నేలమీద పడివున్న సునంద పిల్లలిద్దర్నీ చూపించి, "మీ బిడ్డలు క్షేమంగా వున్నారు" అంటూ దివాకర్ వైపు తిరిగి, "సునంద ఏ తప్పూ చెయ్యలేదు. ఆమెను అనుమానించకండి!" అంటూ ప్రాణాలు విడిచాడు సురేంద్ర.

—:అ యి పో యి ం ది:—